క్లుప్తంగా

రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని తెలంగాణ పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి 6, 7, 8 వార్డుల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన బూత్ కమిటీలను నియమించారు. రానున్న రోజుల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్త కృషి చేయలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు అగ్గిరాములు, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ సత్యనారాయణ, రెడ్యా నాయక్, రామానుజం, ప్యాక్స్ చైర్మన్ జీల కిషన్ బీఆర్‌ఎస్ సీనియర్‌నాయకులు బొల్లి రాంమోహన్, వెంకటరమణారావు, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే



సర్వే చేస్తున్న కార్యదర్శులు

ముస్తాబాద్: మేజర్ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ అమలుతీరుపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఇంటింటా సర్వే చేపట్టారు. మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణాలు, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, మురుగు నీటి వ్యవస్థ, రక్షిత మంచినీటి వినియోగం వంటి అంశాలపై సర్వే నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయడం, సంపూర్ణ ఆరోగ్యం దిశగా ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలు తీరుపై సర్వే సాగిందని ముస్తాబాద్ ఈవో రాజు తెలిపారు. మండలంలోని 21 గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం నిర్మించాలని నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసల గూడెంలో అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టడంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా బుధవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పాత భవనాన్ని కూల్చి 8 నెలలు కావొస్తున్నా ఇంకా కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించడం లేదని తెలిపారు. పనులు త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జీడి బాలకుమార్, దోసల ఉపేంద్ర, దోసల చంద్రం, సత్యం, నిశాంత్, బాలనర్సు, రాజనర్సయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- కంపుకొడుతున్న విలీన గ్రామాలు
- జనావాసాల మధ్య మురుగు
- దోమలు, విషకీటకాలకు ఆవాసం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి శివారు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రెయినేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోయి అధ్వానంగా మారాయి. ప్రస్తుతం ముసురుకు, డ్రెయినేజీల్లోని మురుగు నీరు ముందుకు వెళ్లలేక దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాజీవ్‌నగర్‌లో జనావాసాల మధ్య నిల్వ ఉన్న మురుగు నీరు

సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట, జ్యోతినగర్, రాజీవ్‌నగర్, బోనాల, పెద్దూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. రోడ్లపై చెత్తా చెదారం దర్శనమిస్తోంది. కాలనీల్లో కొన్ని చోట్ల డ్రెయినేజీలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు ముందుకుసాగడం లేదు. దీంతో ఆయా పరిసరాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జనావాసాల మధ్య మురుగు

మున్సిపల్ పరిధిలోని వీలిన గ్రామాల్లోని వార్డుల్లో ఖాళీ ప్రదేశాలు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలకు ఆవాసాలుగా మారాయి. డ్రెయినేజీలు లేక మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం కావడంతో మరింత చిత్తడిగా మారి విషపురుగులకు నిలయంగా మారింది. దీనికి తోడు పందుల స్వైర విహారం, దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. అధికారులు దృష్టి సారించి పారిశుధ్యం నిర్వహణ, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిల్వ కుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు



డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త



రోడ్డుపై పారుతున్న మురుగు

డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోతోంది



డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. చెత్తను తొలగించకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదలజల్లుతోంది. సిబ్బందికి, సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే తప్ప స్పందించడం లేదు. అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి.

12ఎస్‌ఆర్‌ఎల్59) – జాగీరు వేణు, చంద్రంపేట

మురుగుతో ఇబ్బందులు



జనావాసాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉంటుంది. డ్రెయినేజీ లేక మురుగు రోడ్డుపై పారుతుంది. దీనివల్ల దోమలు పెరిగి అనారోగ్యాల బారిన పడుతున్నాం. అధికారులు దృష్టి సారించాలి.

12ఎస్‌ఆర్‌ఎల్60) – జడల రాజు, రాజీవ్‌నగర్ 24 వార్డు

పోటాపోటీగా నిరసన ప్రదర్శనలు

జిల్లాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బుధవారం పోటాపోటీగా దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఉచిత 24 గంటల విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఒకవైపు బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేయగా, మరోవైపు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన ప్రదర్శనలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో దిష్టిబొమ్మల దహనాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున ఇరుపార్టీల నినాదాలతో మండల కేంద్రాలు దద్దరిల్లిపోయాయి. –సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ ఉరితీసి నిరసన తెలుపుతున్న నాయకులు



వేములవాడలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పలు మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎల్లారెడ్డిపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫ్మార్‌కు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి అనంతరం పాత బస్టాండ్‌లో దహనం చేశారు. ముస్తాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షులు ఎంపీపీలు, వైస్‌ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఏఎంసీ చైర్మన్లు, సెస్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోయినపల్లిలో..



వేములవాడరూరల్: వట్టెంలలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇల్లంతకుంటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించినందుకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు బుధవారం ధర్నాలు నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ముస్తాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ప్రదేశంలోనే కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు,మండల అధ్యక్షులు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవి, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న ఎస్సై

కార్మిక కుటుంబాలకు రుణాల చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మిక కుటుంబాలకు రూ. 15 వేల చొప్పున రుణాల చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక కుటుంబాలకు అండగా ఉండేందుకు సిరిసిల్ల పద్మశాలీ సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లించి ట్రస్టు అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కళ్యాణ భవనం అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ గడ్డం విటల్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంకుడు గుంతలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లచ్చాలు

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఇంకుడు గుంతలు పూర్తిచేయాలని టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో పి.లచ్చాలు ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయల వద్ద టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, ఏపీవో రాపోల నాగరాజు, జేఈ రాజనర్సు, టీఏలు లక్ష్మణ్, మనోహర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ సాధనకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న గుండా థామస్

కోనరావుపేట: ఏబీసీడీ వర్గీకరణ సాధన కోరకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుండా థామస్ అన్నారు. మండలంలోని మర్తనపేట గ్రామంలో అయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామనే మాట బీజేపీ నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకటేశ్, శ్రీనివాస్, దేవరాజు, అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు వేయాలి

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని సెస్ ఎండీకి వినతిపత్రం సమర్పించినట్లు గ్రామ రైతులు తెలిపారు. రైతుల పొలాల పరిసరాల్లో వరద కాల్వ పనుల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. దీంతో నీరు లేక వరి నారు మడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆచూకీ తెలపండి



వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని, మూడో వ్యక్తి వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన కైర వెంకటేశ్ తప్పించుకుని తిరుగుతున్నాడని, వెంకటేశ్ ఆచూకీ తెలపాలని డీఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 56412కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని గంగమ్మ గుడి, సిద్ధార్థ స్కూల్, తిప్పాపూర్ బస్టాండు, తాజ్ హోటల్, శ్రీనివాస్‌సూపర్ మార్కెట్ ఏరియాల్లో గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

24 గంటల ఉచిత విద్యుత్ సాధించుకున్న హక్కు

- కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- నేడు వేములవాడలో ధర్నా
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వ్యవసాయ రంగానికి 24 గంటలు ఉచిత విద్యుత్ తాము సాధించుకున్న హక్కు అని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో సంగీత నిలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన విరుద్ధ ప్రకటనలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాల మేరకు వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటలకు మూలవాగు బ్రిడ్జి వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సెస్ డైరెక్టర్లు, ఫాక్స్ చైర్మన్లు, పట్టణ, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వేములవాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కలుసుకుని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యా సంస్థల బంద్ విజయవంతం



ముస్తాబాద్‌లో తరగతుల బహిష్కరణ

ముస్తాబాద్/వీర్నపల్లి: విద్యరంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు విచ్చలవిడిగా ప్రభుత్వాలు అనుమతులు ఇస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, జిల్లా కోకన్వీనర్ నడిగోట్ల లక్ష్మి, ఎల్లవ్వ పాల్గొన్నారు.

వినూత్న నిరసన



వీర్నపల్లిలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన



చందుర్తిలో బోనాలతో నిరసన ప్రదర్శనలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

ఇల్లంతకుంట/వీర్నపల్లి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/చందుర్తి: సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం జీపీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్‌తో పాటు నాయకులు సంఘీభావం తెలిపారు.



ఎల్లారెడ్డిపేటలో..

సీపీఆర్‌పై అవగాహన

ఇల్లంతకుంట: సీపీఆర్‌పై మండలంలోని విలేజ్ సేఫ్టీ కమిటీ సభ్యులకు ఎస్సై రాజేశ్ బుధవారం అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను ప్రత్యక్షంగా వివరించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ రూల్స్, ప్రమాదాలు నివారించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శరణ్య, రమేశ్, ఏఎస్సై మోతీరాం పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పోలీసులకు, వైద్య సిబ్బందికి, వలంటీర్లకు బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వేణు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, సృజన్ శ్రీవాత్సవ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్సై మహేశ్, ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్‌ఓ రమేశ్, ఎంఎస్‌వో అంజయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేశ్

ఎల్లారెడ్డిపేటలో భారీ వర్షం



ఎల్లారెడ్డిపేటలో కురుస్తున్న వర్షం

ఎల్లారెడ్డిపేట: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. స్థానికంగా రైతులు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. కప్పతల్లి ఆటలు ఆడి వరుణుడు కరుణించాలని వేడుకున్నారు. రైతులు పూజలు చేసిన రెండు రోజులకే సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం పడడంపై రైతాంగం హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో ఇంతటి భారీ వర్షం పడడం ఇదే తొలిసారి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బట్టు రాజు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, మధు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, భూమేశ్, దేవేందర్‌రెడ్డి, గుంటి ఆగం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి

రుద్రంగి: రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారి ప్రాణాలను కాపాడేందుకు బాధితులకు అందించే ప్రథమ చికిత్సపై అందరికీ అవగాహన ఉండాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు.